క్లుప్తంగా

ఆరెకటికెల అభ్యున్నతికి కృషి

పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలోని ఆరెకటికె సంఘం భవనంలో సోమవారం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. అధ్యక్షుడిగా డాగోజీరావు, ఉపాధ్యక్షుడిగా మహిందర్‌జీ, సలహాదారులు కోటేశ్వరావు, దినేష్, కార్యవర్గ సభ్యులు శివాజీరావు, మోహన్‌జీరావ్, మౌలాజీ, రాంచందర్, మహబూబ్‌జీ, మహేష్‌రావు, దేవోజీ, కృష్ణజీరావు తదితరులను ఎన్నుకున్నారు.

కేజీబీవీలో వైద్య పరీక్షలు

వనపర్తి: వీపనగండ్ల మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో సోమవారం ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా పాఠశాలల్లో కళ్ల కలక వ్యాధి, విషజ్వరాలు వ్యాపిస్తుండడంతో ముందస్తు జాగ్రత్తలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కళ్ల కలక వ్యాధి సోకిన వారు వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకోవాలని, ఆర్‌బీఎస్‌కే వైద్యులు డాక్టర్ హరీష్, హెల్త్ సూపర్‌వైజర్ కమలమ్మ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌ఓ రాధ, ఏఎన్‌ఎం రేణుక పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి: కేసు నమోదు

వనపర్తి: పొలం వద్ద పని చేస్తున్న తన కుమారుడు అజయ్‌పై కాలనీకి చెందిన శ్రీనివాసులు, యాదయ్య రాళ్లు, కర్రలతో దాడి చేసి గాయపరిచారని సోమవారం పెద్దన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు. బాధితుడు అజయ్ నిందితుల కూతురిని వేధిస్తున్నాడని ఆరోపిస్తూ దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో పోరాటం

పెబ్బేరు రూరల్: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుదాం అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోష, కురుమయ్య పిలుపునిచ్చారు. వనపర్తి పట్టణ కేంద్రంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలన్నారు. ఆగస్టు 9, 10 తేదీల్లో దేశవ్యాప్తంగా 14 సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా చేపడతున్నామని తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో గంధం మదన్, డి కురుమయ్య, విజయకుమార్, నందిమళ్ల రాములు, నరేష్ పాల్గొన్నారు

వ్యక్తి బైండోవర్

ఆత్మకూర్: కోడి పందెలు నిర్వహిస్తున్న వ్యక్తిని తహసీల్దార్ రాజు ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. ఆత్మకూర్ మండలం మోట్లంపల్లికి చెందిన నర్సింహులు తరుచుగా కోడిపందెలు నిర్వహిస్తున్నాడు. పక్కా సమాచారంతో ఆదివారం రాత్రి దాడులు నిర్వహించి వారి వద్ద నుంచి రూ.14,370 నగదు, కోడిపుంజు, 12 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. గోపాల్‌పేట మండలం బుద్దారం గ్రామానికి చెందిన కావలి అంజి, కావలి రాము, మదనాపూర్ మండలం దుప్పల్లికి చెందిన వెంకటేష్, శేఖర్, నిర్వాహకుడు నర్సింహులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. భవిష్యత్తులో కోడిపందెలు నిర్వహించకుండా సత్ప్రవర్తన నిమిత్తం ఏడాది కాలం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కొత్తకోట రూరల్: పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి చేసి 8మందిని అదుపులోకి తీసుకున్న ఘటన కొత్తకోట మండలం కనిమెట్ట గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి కథనం ప్రకారం.. కనిమెట్ట శివారులో పాలకేంద్రం సమీపంలో నిర్మానుష ప్రదేశంలో కొందరు పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడి నిర్వహించారు. ఈ దాడిలో 8మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.5100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శ్రద్ధ తీసుకోవాలి



మదనాపురం: మండలంలోని నర్సింగాపురంలో సోమవారం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ముందస్తు ఆరోగ్య శిబిరం సర్వేలో భాగంగా సీబీఎస్ ఎన్జీఓ లేబర్ కార్డు ఉన్న ప్రతి ఒక్క కార్మికుడికి అన్ని రకాల ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం మండల అధ్యక్షుడు బిట్ల రాజశేఖర్ మాట్లాడుతూ కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి మహేందర్, మధు, రవి, బీచుపల్లి,తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో సంక్షేమం

పాన్‌గల్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించాలని కొల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ కోకన్వీనర్ అన్వేష్ అన్నారు. సోమవారం కార్యక్రమంలో జగన్‌గుప్తా, క్రాంతి, శివ, మధుసూదన్‌యాదవ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నేతన్నలను కాపాడుకుందాం



వనపర్తిలో చేనేత చీరలు ధరించి అవగాహన కల్పిస్తున్న మహిళా ఉపాధ్యాయులు

వనపర్తి టౌన్: ప్రపంచానికి నాగరికతను నేర్పిన వృత్తి కళాకారులు నేతన్నలని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలో నేతన్నలు ఊశన్న, శ్రీరాములును శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కళావేదిక ప్రతినిధులు కందూరు నారాయణ రెడ్డి, జనజ్వాల, భైరోజు చంద్రశేఖర్, చెన్నపద్మ, సత్యనారాయణ, సత్తార్, బండారు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేతన్నను ప్రోత్సహిద్దాం

చేనేత దుస్తులను ధరించి నేతన్నను ప్రోత్సహిద్దామని వనపర్తి బాలికల ఉన్నత పాఠశాల మహిళా ఉపాధ్యాయులు నినదించారు. సోమవారం చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత వస్త్రాలు ధరించి, చేనేతను కాపాడుకుందామని మహిళా ఉద్యోగుల వేదిక కన్వీనర్ చెన్నపద్మ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు తారాబాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమరచింత: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని అమరచింత చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు మహంకాళీ చంద్రమోహన్ చేతుల మీదుగా శాలువ, పూలమాలతో చేనేత కార్మికులకు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న చేనేత పరిశ్రమకు జీవం పోస్తున్న కార్మికులకు సత్కరించడం తన భాగ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత పరిశ్రమతో పాటు కార్మికుల బాగోగుల కోసం సంక్షేమ పథకాలను తీసుకొచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో క్యామ శ్రీను, సాంబరి సత్యనారాయణ, దేవరకొండ లచ్చన్న, నారాయణ, బాలస్వామి పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం చేనేత కార్మికులకు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఆవుల శైలజ మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో ఆకలి చావులు, ఆత్మహత్యలు, వలసలతో తల్లడిల్లిన చేనేత పరిశ్రమ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత సీఎం కేసీఆర్ చేనేత కార్మికుల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, వైస్ ఎంపీపీ బాల్‌చందర్‌రెడ్డి, ఎంపీఓ రోజారెడ్డి, సర్పంచ్‌లు వెంకటస్వామి, రాజవర్ధన్‌రెడ్డి, నాయకులు కురుమూర్తి, యాదగిరి, పరమేష్, మహేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



అమరచింతలో..



వనపర్తిలో..



పెబ్బేరులో..

తల్లిపాలు అమృతంతో సమానం



తాటిపాములలో..



అమరచింతలో మాట్లాడుతున్న మంగమ్మ

వనపర్తి: పుట్టిన శిశువులకు ఆరు నెలల పాటు తల్లిపాలు పట్టించడమే శ్రేయస్కరమని వనపర్తి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సునందిని అన్నారు. సోమవారం స్థానిక ఎంసీహెచ్‌లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లిపాలతో శిశువులో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు.

అమరచింత: అప్పుడే పుట్టిన చిన్నారులకు తల్లి ముర్రుపాలు పట్టించాలని, అవి చిన్నారిలో రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. పట్టణంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మీనుగ లక్ష్మి పాల్గొన్నారు.

పాన్‌గల్: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని చిక్కేపల్లి పీఎస్ హెచ్‌ఎం కాశన్న అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని చిక్కేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుస్మిత, అంగన్‌వాడీ కార్యకర్త రాధ ఉన్నారు.

పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలోని ఐసీడీసీ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, ఎంపీపీ ఆవుల శైలజ హాజరై మాట్లాడారు. తల్లిపాల ద్వారా పిల్లల్లో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. ఆనంతరం గర్భిణులకు సీమంతం, పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చిన్న ఎల్లారెడ్డి, ఐసీడీసీ సూపర్‌వైజర్ బాలీశ్వరమ్మ, లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

తాటిపాములలో..

తల్లి పాలతోనే పసి పిల్లలకు మంచి ఆరోగ్యం ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అన్నారు. శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రాజేశ్వరి, చెన్నమ్మ, సంగీత, భారతి పాల్గొన్నారు.

మదనాపురం: పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని కేవీకే శాస్త్రవేత్త అనిత అన్నారు. సోమవారం మదనాపురం కేవీకేలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాల లోపంతో పది మిలియన్ల మంది చిన్నారులు ఐదేళ్లలోపు వయసులోనే మరణిస్తున్నారని, అందులో నాలుగు మిలియన్ల మంది చిన్నారులు పుట్టిన 28 రోజుల్లో మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి మరణాల రేటును తగ్గించాలంటే ముర్రుపాలు ఎంతో దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో ఆత్మకూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి భారతి, సూపర్‌వైజర్ నర్మద తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి



పామిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న యుగంధర్

కొత్తకోట రూరల్: విద్యార్థులు ప్రాథమిక విద్య నుంచే ఇంగ్లిష్‌పై పట్టు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కో ఆర్డినేటర్ యుగంధర్ సూచించారు. ఎఫ్‌ఎల్‌ఎన్ తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా సోమవారం పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంగ్లిష్‌లో పలు ప్రశ్నలు వేసి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థులకు ఇచ్చిన హోం వర్క్ బుక్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎంఈఓ జయశంకర్, నోడల్ అధికారి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: సులువైన బోధన పద్ధతులను అవలంబిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని విద్యాశాఖ రాష్ట్ర స్థాయి పరిశీలకులు చంద్రశేఖర్ అన్నారు. సోమవారం పాన్‌గల్ మండల కేంద్రంలో ఎఫ్‌ఎల్‌ఎన్‌పై ఇంగ్లిష్ సబ్జెక్టుపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం మద్దిలేటి, ఆర్పీలు రాఘవేంద్ర, ఈశ్వరయ్య, సీఆర్పీలు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మారిన సిలబస్ విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తొలిమెట్టు కార్యక్రమ స్టేట్ అబ్జర్వర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి మండల ఉపాధ్యాయులకు ఇస్తున్న తొలిమెట్టు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గోపాల్‌పేట నోడల్ అధికారి రమాకాంత్, రేవల్లి మండల నోడల్ అధికారి కేశవులు, రిసోర్స్ పర్సన్స్ సురేష్, చైతన్య, స్రవంతి, సీఆర్పీలు చంద్రశేఖర్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ ఫలితాల్లో మెరిసిన పల్లె కుసుమాలు



పెబ్బేరులో ఎస్‌ఐగా ఎంపికైన కిరణ్‌కుమార్, తల్లిదండ్రులను సన్మానిస్తున్న గ్రామస్తులు



స్వాతి



భాస్కర్



మనోహర్‌రెడ్డి



తేజస్విని



రంజిత్‌కుమార్

పాన్‌గల్: సోమవారం విడుదల అయిన ఎస్‌ఐ (సివిల్) ఫలితాల్లో మండల వాసులు ప్రతిభ చాటారు. మండలంలోని కేతేపల్లికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ రాజేందర్‌రెడ్డి, అరుణ దంపతుల కుమారుడు మనోహర్‌రెడ్డి 255 మార్కులు సాధించి ప్రతిభ చాటారు. మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన మండ్ల కాశమ్మ, రాములు కూతురు తేజస్వి, అన్నారంతండాకు చెందిన ముడావత్ దీప్తి, శంకర్‌నాయక్ కుమారుడు ముడావత్ రంజిత్‌నాయక్ ఎస్‌ఐగా ఎంపికయ్యారు.

గోపల్‌దిన్నె నుంచి స్వాతి

వీపనగండ్ల మండలంలోని గోపల్‌దిన్నెకు చెందిన కుమ్మరి స్వాతి ఎస్‌ఐ ఫలితాల్లో 15వ ర్యాంకు సాధించి సివిల్ ఎస్‌ఐగా ఎంపికైంది. గ్రామానికి చెందిన భాస్కర్, వెంకటమ్మ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు కాగా మొదటి కూతురు ఉపాధ్యాయురాలిగా స్థిరపడగా.. రెండో కూతురు స్వాతి ఎస్‌ఐగా ఎంపిక కాకవడంతో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మదనాపురం: మండలంలోని గోపన్‌పేటకు చెందిన సాయమ్మ, వెంకటన్న (గ్రామ పంచాయతీ వాటర్‌మెన్) కుమారుడు కావలి భాస్కర్ ఎస్‌ఐ ఫలితాల్లో జోగులాంబ జోన్ పరిధిలో జనరల్ కేటగిరీలో ఉద్యోగం సాధించారు.

పెబ్బేరు రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేటకు చెందిన బుడగ జంగాల ఎలపర్తి కిరణ్‌కుమార్ ఎస్‌ఐగా ఎంపికయ్యారు. బుడగ జంగాల తిరుపతమ్మ, బుచ్చన్నలకు ముగ్గురు కుమారులు ఉండగా తల్లిదండ్రులు హోటళ్లలో దినసరి కూలీగా పనిచేస్తూ జీవనం గడుపుతూ పిల్లలను చదివించారు. పెద్ద కుమారుడు కిరణ్‌కుమార్ సివిల్ ఎస్‌ఐగా ఎంపిక కావడంతో గ్రామస్తులు, తోటి మిత్రులు తల్లిదండ్రులను, కిరణ్‌కుమార్‌ను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో శ్రీరంగాపూర్ సింగిల్‌విండో అధ్యక్షుడు జగన్నాథం నాయుడు, కృష్ణయ్య, భీముడు, తాటికొండ అంజనేయులు, కృష్ణ, ఈశ్వర్, శ్రీనివాసులు, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

గోపాల్‌పేట: ప్రభుత్వం పశువులకు ఉచితంగా అందించే మందులను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన సిబ్బందితో కలిసి మండలంలోని తాడిపర్తిలో గాలికుంటు, ముద్దచర్మ, నట్టల నివారణ టీకాలు వేశారు. మొత్తం 296 గేదెలు, 142 ఆవులకు టీకాలు వేసినట్లు తెలిపారు. మంగళవారం కూడా తాడిపర్తిలోనే క్యాంపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీఏ బద్రీనాథ్, ఓఎస్ రాములు, జీఎం తిరుమల్, రైతులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి మాధవి మాట్లాడుతూ వ్యాధి సోకిన పశువులకు ప్రత్యుత్పత్తి, పనిచేసే సామర్థ్యం తగ్గుతుందన్నారు. రైతులు తమ పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. 311 గేదెలకు గాలికుంటు టీకా, నట్టల మందులు వేశామని, 148 ఆవులకు ఎల్‌ఎస్‌డీ వ్యాక్సినేషన్ చేశామని తెలిపారు. కార్యక్రమంలో హబీబ్, జేవీఓ లలిత, రాఘవేంద్ర పాల్గొన్నారు.

జమ్ము తొలగింపు



కాల్వలో జమ్ము తొలగిస్తున్న ప్రొక్లెయిన్

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల శంకరసముద్రం రిజర్వాయర్ నుంచి 19వ ప్యాకేజ్ కెనాల్ పూర్తిగా జమ్ముతో నిండిపోయింది. దీంతో సాగునీరు చివరి ఆయకట్టుకు వెళ్లేందుకు అవాంతరాలు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు ఎంపీపీ గుంత మౌనిక దృష్టికి తీసుకెళ్లారు. ఆమె రైతులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే అల వెంకటేశ్వర్‌రెడ్డికి వివరించడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జమ్ము తొలగించేందుకు రూ.25వేలు రైతులకు అందజేశారు. ఎమ్మెల్యే ఇచ్చిన డబ్బులతో రైతులు అందరూ కలిసి కొంత డబ్బులను పోగుచేసి సోమవారం పొక్లెన్ సహాయంతో కాల్వలోని జమ్మును తొలగించారు. అడిగిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, ఎంపీపీకి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గుంత మల్లేష్, కోటేశ్వర్‌రెడ్డి, రమేష్, వెంకటయ్య, రమేష్, అంజి, దేవన్న, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

రాధకు డాక్టరేట్



మదనాపురం: మండలంలోని గోపాన్‌పేటకు చెందిన లెక్చరర్ కొట్టం రాధ రాజస్థాన్ సన్‌రైజ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. రసాయన శాస్త్ర విభాగంలో భ్రమన స్పెక్ట్రోస్కోపీ ద్వారా బలహీనంగా కట్టుబడి ఉన్న కాంప్లెక్స్‌లో ఇంటర్ మెలిక్యులర్ ఇంటరాక్షన్ అనే అంశంపై అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హర్ష శర్మ పర్యవేక్షణలో పరిశోధనను పూర్తి చేసి డాక్టరేట్ పొందారు. ప్రస్తుతం అమ్రాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. రాధను సర్పంచ్ ఆంజనేయులుయాదవ్, గ్రామస్తులు అభినందించారు. .

మహిళా చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న షీ టీం ఎస్‌ఐ ఇందిర

కొత్తకోట: నేటి సమాజంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు ప్రతి మహిళ, విద్యార్థిని మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీ టీం ఎస్‌ఐ ఇందిర అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులను వేధింపులకు గురిచేస్తే వెంటనే షీ టీంకు లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జువైనల్ జస్టిస్ బోర్డ్ సభ్యులు ఈస్టర్ గ్రేస్, ఆర్‌డీఎస్ లక్ష్మి, కైలాస, సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సౌజన్య, నాగలక్ష్మి, హరికృష్ణ, విశ్వకాంత్ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దళితులు

వనపర్తి: వీపనగండ్ల మండలంలోని సంగినేనిపల్లిలో దళితుల ఇళ్ల స్థలాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి భూమిని కొనుగోలు చేసి పట్టాలు ఇచ్చింది. ఆ భూముల్లో పట్టాదారుకు చెందిన వారసులు భూమి తమదే అంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని గ్రామంలోని దళిత రైతులు సోమవారం స్థానిక తహసీల్దార్ వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. 1984 సంవత్సరంలో 42 మందికి గ్రామంలోని సర్వే నెంబర్ 1011, 1012లో ఒక్కొక్కరికి మూడు సెంట్ల చొప్పున భూమి ఇచ్చారని, కానీ కావాలని కొందరు వారసులు దళితులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని వాపోయారు. ఈ స్థలంపై పూర్తి స్థాయి సర్వే నిర్వహించి నిజమైన లబ్ధిదారులను గుర్తించి తమకు ఇళ్ల పట్టాలు అందజేయాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీరయ్య, లోకేష్, మీసాల మోహన్, నాగరాజు, వెంకటస్వామి, వెంకటయ్య, కుర్మయ్య, రమేష్ ఉన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

వనపర్తి: వీపనగండ్ల మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేవైఎం నాయకులు సోమవారం తహసీల్దార్ వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దాదాపు 300 మంది విద్యార్థులు ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారని, మండల కేంద్రానికి చేరువలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో వారు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని బీజేవైఎం జిల్లా కార్యదర్శి మహేష్‌యాదవ్ అన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీకాంత్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు రాఘవేంద్ర, ప్రతాప్‌గౌడ్, శ్రీకాంత్ నాయుడు, శివయాదవ్, మధు నాయుడు పాల్గొన్నారు.

బాధితులకు చేయూత



మదనాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో వర్షాలకు ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు తహసీల్దార్ అబ్రహం లింకన్, ఎంపీడీఓ నాగేంద్రం, జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్ చేతుల మీదుగా సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో టార్పాలిన్ కవర్, బెడ్‌షీట్, కిచెన్ సెట్‌తో పాటు నిత్యావసర వస్తువులు అందించారు. కార్యక్రమంలో యాదగిరి, రెడ్‌క్రాస్ మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, గిర్దావర్ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు రాంనారాయణ, ఆంజనేయులు యాదవ్, శ్రీనివాసులు, అరుణ రమేష్, కురుమూర్తి శ్రావణి పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు అవార్డులు



అమరచింత: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో సోమవారం ప్రభుత్వపరంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అమరచింత చేనేత కార్మికులు మహంకాళీ బాలస్వామి, రాధ అవార్డులతో పాటు రూ.25 వేల నగదు పారితోషికంను అందించారు. కార్యక్రమంలో అమరచింత చేనేత ఉత్పత్తుల సంఘం సీఈఓ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

ఆత్మకూర్: 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా చేస్తామని, వంద పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేస్తామని మంత్రి హరీష్‌రావు హామీ ఇచ్చి అమలు చేయకపోవడం సిగ్గుచేటని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్ మండిపడ్డారు. సోమవారం ఆత్మకూర్‌లోని పార్టీ కార్యాలయంలో మండల స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో రేచింత శ్రీను, అశోక్‌కుమార్‌జీ, నరాల నారాయణ, ఆనంద్, వెంకట్రాములు, భీంరెడ్డి ఉన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

ఆత్మకూర్: ఆర్టీసీ కార్మికులను రెగ్యులర్ చేస్తూ సీఎం కేసీఆర్ ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించడంతో ఆత్మకూర్‌లో ఆర్టీసీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో శ్రీధర్‌గౌడ్, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌ఎంపీపీ కోటేష్, రవియాదవ్, కౌన్సిలర్లు పోషన్న, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

సర్టిఫికెట్ అందజేత

కొత్తకోట రూరల్: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో మండలంలోని నాటవెల్లికి చెందిన ఈకల లక్ష్మి క్యాంటీన్, క్యాటరింగ్‌పై 20రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఉక్కు సంస్థ వారు హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో గల ప్రముఖ రెస్టారెంట్‌లో 'సహాయక కుక్'గా నియమించారు. శిక్షణ తీసుకున్న రెస్టారెంట్ వారు ఇచ్చిన సర్టిఫికెట్‌ను కొత్తకోట తహసీల్దార్ బాల్‌రెడ్డి, ఎంపీపీ గుంత మౌనిక, ఎంపీడీఓ కృష్ణయ్యకు అందజేశారు. గుంత మల్లేష్, అల్లాబాషా, జీవన్‌గౌడ్, శ్యామ్, ఏపీఎం రాజశేఖర్‌రెడ్డి, బాలనాగమ్మ తదితరులు ఉన్నారు.

అప్పరాల విద్యార్థుల ప్రతిభ

కొత్తకోట రూరల్: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ఈనెల 5న నిర్వహించిన జిల్లా స్థాయి ఉపన్యాస, వ్యాసరచన పోటీల్లో అప్పరాల జెడ్పీహెచ్ విద్యార్థులు రేవతి, రాజేశ్వరి ప్రతిభ కనబరిచారు. వీరికి జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి బహుమతులతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు.

అంకితభావంతో పనిచేస్తాం

ఆత్మకూర్: స్థానిక తహసీల్దార్ రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గద్వాల నుంచి బదిలీపై ఇక్కడికి బదిలీపై వచ్చారు. తహసీల్దార్‌కు రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

తహసీల్దార్‌కు సన్మానం

ఖిల్లాఘనపురం: తహసీల్దార్ పాండునాయక్‌ను సోమవారం బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. మహబూబ్‌నగర్ రూరల్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఆయన ఇటీవలే మండల తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. కార్యక్రమంలో బుచ్చిబాబుగౌడ్, ఆశన్న, అంజనేయులు, శివశంకర్, రాంచందర్, గోపాల్‌రెడ్డి, రాము పాల్గొన్నారు.



ప్రజా గొంతుక మూగబోయింది

వనపర్తి టౌన్: ప్రజల పక్షాన పోరాడేందుకు మాట, పాటను తూటాలా పేల్చిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జీ చెన్నరాములు అన్నారు. బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి రమేష్, గట్టు మన్నెం, మైబూస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట: స్థానిక చౌరస్తాలో గద్దర్ చిత్రపటానికి ఆయన అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాములుయాదవ్, చెన్నకేశవరెడ్డి ఉన్నారు.

వనపర్తి: ప్రజాకళాకారుడు గద్దర్ మృతి చెందడంతో సోమవారం వీపనగండ్ల మండల కేంద్రంలో పలువురు కళాకారులు గద్దర్, సాయిచంద్ చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జానపద కళాకారుడు పాము నాగులు, నక్క నర్సింహ, డప్పు నర్సింహ, చిన్నయ్య, అయ్యన్న, కత్తి నర్సింహ, మీసాల పెద్దరాములు, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆత్మకూర్: స్థానిక గాంధీచౌక్‌లో వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలకిష్టన్న, రాబర్ట్, శ్రీహరి, నర్సింహశెట్టి, భరత్, లక్ష్మీనారాయణశెట్టి, లింగన్న, రమేష్, శివరాములు, మహేందర్, మహేష్, బాలరాజు, అంజి తదితరులు ఉన్నారు.

పెబ్బేరు రూరల్: గద్దర్ వ్యక్తి కాదు, ఉద్యమ శక్తి అని, ఆయన మరణం సమాజానికి తీరని లోటు అని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరాం, పట్టణ కార్యదర్శి రమేష్ అన్నారు. వనపర్తి పట్టణ కేంద్రంలో అంబేడ్కర్ చౌక్‌లో సీపీఐ ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళావతమ్మ, లక్ష్మీనారాయణ, రమణ, వంశీ, వెంకటమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: ప్రజా గాయకుడు గద్దర్ అంతిమ యాత్రకు మండలంలోని తిర్మలాయపల్లికి చెందిన డప్పు కళాకారులు అధ్యక్షుడు కురుమయ్య, కార్యదర్శి నర్సింహులు ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో తన పాటలతో ప్రతి ఒక్కరిని కదిలించిన మహా గాయకుడు గద్దర్ అన్నారు.